క్లుప్తంగా

నిరంజన్‌రెడ్డి చిత్రపటానికి నివాళి



నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు

ఇబ్రహీంపట్నం: యంపల్ల నిరంజన్‌రెడ్డి తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్‌ నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు మైసయ్య, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్లు మాట్లాడుతూ కర్ణంగూడలో సామాన్య కుటుంబంలో జన్మించిన నిరంజన్‌రెడ్డి పేదల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన నాయకుడని కొనియాడారు. రాజకీయంగా అంచలంచెలుగా ఎదిగిన నిస్వార్థ నాయకుడన్నారు. పేదలకు, నమ్ముకున్న వారికి అండగా నిలబడ్డారన్నారు. ఎంపీటీసీగా, మార్కెట్‌ డైరెక్టర్‌గా పనిచేసిన నిరంజన్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో నల్లబోలు శ్రీనివాస్‌రెడ్డి, గొరిగే శేఖర్‌గౌడ్, విష్ణుచారి, శ్రీనాథ్‌రెడ్డి, బాబు, గుర్జని యాదయ్యగౌడ్, బుచ్చిరెడ్డి, కాలే గణేశ్, దస్‌పాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



ఆరాధన మహోత్సవంలో సత్తయ్య

తుర్కయంజాల్‌: సృష్టిలో జరిగే పరిణామాలన్నింటినీ తన దివ్య దృష్టితో ముందుగానే చెప్పిన గొప్ప సంఘ సంస్కర్త శ్రీ మద్విరాట్‌ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్‌ కొత్తకుర్మ సత్తయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని విశ్వకర్మ భవనంలో నిర్వహించిన 331వ ఆరాధన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న యాదీలాల్‌

ఆమనగల్లు: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రముఖ న్యాయవాది, కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ ఇంచార్జి యాదీలాల్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ అభివృద్ధికి చేపట్టవలసిన పనులు, ప్రభుత్వపరంగా సహకారం అందించాలని కోరినట్లు యాదీలాల్‌ తెలిపారు.

ధరణిపోర్టల్‌ సమస్య సరిష్కరించండి

యాచారం: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటినా ధరణి పోర్టల్‌లో సమస్య నేటికీ పరిష్కరించలేదని బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్‌ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ధరణి పోర్టల్‌ వ్యవస్థలో అక్రమాలు, అవకతవకలకు నిలయంగా మారిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని ఆశించిన రైతులకు తీవ్ర నిరాశే మిగులుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌ ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో ఎదురవుతున్న సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో వీఆర్‌ఓలు లేకపోవడం కూడా రైతుల భూ సమస్యలు పరిష్కారం కాకపోవడానికి మరో కారణంగా నిలుస్తున్నాయని తెలిపారు.

కపిల్‌ సిబాల్‌ను కలిసిన జగన్‌

ఆమనగల్లు: సుప్రీంకోర్టు బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా ఎన్నికైన కపిల్‌ సిబాల్‌ను న్యూఢిల్లీలో శనివారం మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది, రాష్ట్ర ప్రజారోగ్య బాధితుల సంఘం అధ్యక్షుడు జగన్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని సుప్రీంకోర్టు వద్ద కపిల్‌ సిబాల్‌ను కలిసిన జగన్‌ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్‌ కళాశాల కలేనా?

- నేతల మాటలు నీటీ మీద రాతలేనా?
- విద్యార్థుల ఇక్కట్లు పట్టవా?
- మధ్యలోనే చదువులు ఆపేస్తున్న పేదలు
- పట్టించుకోని అధికారులు

కడ్తాల్‌: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఏర్పాటు నేటికి కార్యరూపం దాల్చలేదు. 2024–25 విద్యా సంవత్సరంలోనైనా ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాల లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులకు ఇంటర్మీడియట్‌ నేటికి అందని ద్రాక్షగానే మారింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు పదోతరగతికే పరిమిత మవుతున్నారు. నూతనంగా ఏర్పడిన కడ్తాల్‌ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఏర్పాటు అత్యంత అవశ్యకం. ఇక్కడ ప్రభుత్వ కళాశాల అందుబాటులో లేక పోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువులను అర్ధాంతరంగా చాలిస్తున్నారు. ప్రైవేట్‌ కళాశాలల్లో పేద విద్యార్థులు వేలల్లో ఫీజులు కట్టలేక మిన్నకుండి పోతున్నారు. ఆమనగల్లులో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఉన్నా అక్కడికి వెళ్లాలంటే 20కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సిందే. కడ్తాల్‌ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను నేటికీ ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. ఇక్కడి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. వివిధ సందర్భాలలో ఇక్కడికి వచ్చిన నాయకులు, అధికారులు జూనియర్‌ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పడమే కాక, హామీలను సైతం గుప్పించారు. కార్యరూపంలో మాత్రం నేటికి ఆ దిశగా అడుగులు పడడం లేదు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయక పోవడం నాయకులకు, అధికారులకు పరిపాటిగా మారింది.



కడ్తాల్‌ మండల కేంద్రం

మండల పరిధిలో ఉన్నత పాఠశాలలు..

మండల కేంద్రంలోని రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు, కస్తూరిబాగాంధీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారు ప్రతీఏటా 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. దీంతో పాటు మరో నాలుగైదు ప్రైవేట్‌ ఉన్నత పాఠశాలలో 200మంది వరకు విద్యార్థులు ప్రతి ఏటా ఎస్సెస్సీ పరీక్షకు హాజరవుతున్నారు. అదేవిధంగా రావిచేడ్, ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ గ్రామాలలో కూడా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ఆయా పాఠశాలలో ప్రతి సంవత్సరం సుమారు 500నుంచి 600మంది వరకు విద్యార్థులు పదోతరగతి విద్యనభ్యసిస్తు న్నారు. వీరే కాక మైసిగండి, గోవిందాయిపల్లి, కర్కల్‌ పహడ్, పడకల్, మక్తమాదారం, సాలార్‌పూర్, దసర్లపల్లి, ముచ్చర్ల, శాయిరెడ్డిగూడెం తదితర గ్రామాలనుంచి పదోతరగతి చదువుకునేందుకు వస్తుంటారు. కడ్తాల్‌ మండల పరిధిలోని పరిసర గ్రా మాల్లో సుమారు ఐదువందల నుంచి ఆరువందల మంది విద్యార్థులు పదోతరగతి విద్యనభ్యసిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల లేక పోవడంతో..

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల లేక పోవడంతో ఎటా వందలాది మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌కు దూరమవుతున్నారు. కొద్దో గొప్పో ఆర్థికంగా ఉన్నావాళ్లు సమీప పట్టణాల్లోని ప్రైవేట్‌ కళాశాలలకు వెళ్తున్నారు. కందుకూర్, తుక్కుగూడ, కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్‌ తదితర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. కడ్తాల్‌ మండల కేంద్రంలో కళాశాల ఏర్పాటైతే పట్టణ విద్యార్థులతో పాటు సమీప గ్రామాల విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. కళాశాల ఏర్పాటుతో తలకొండపల్లి మండలంలోని పెద్దూరు, పడకల్, వెంకటాపూర్, కడ్తాల్‌ మండలంలోని రావిచెడ్, చల్లంపల్లి, మక్తమాదారం, న్యామాతపూర్, వంపూగూడా, చల్లంపల్లి, మైసిగండి, కర్కల్‌పహడ్, గోవిందాయిపల్లి, మర్రిపల్లి, ఏక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ తదితర గ్రామాలకు చెందిన పేద విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో గత్యంతరం లేక ప్రవేట్‌ కళాశాలలో ఫీజులు కట్టి చదువుకోవలసిన దుస్థితి నెలకొంది. మరి కొంత మంది విద్యార్థులు ఫీజులు కట్టలేక చదువును మధ్యలో ఆపేస్తున్నారు. ఇప్పటికైనా కళాశాల ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నా కడ్తాల్‌ మండల కేంద్రంలో జూనియర్‌ కళాశాల మంజూరునకు కృషి చేయాలని కోరుతున్నారు.

కార్యాచరణ రూపొందిస్తాం



మండల కేంద్రంలో కళాశాల ఏర్పాటు చేయాల్సిందే..అన్ని సౌకర్యాలు గల కడ్తాల్‌ మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటునకు గతంలో అనేక ఆందోళనలు చేపట్టాం. ఐనప్పటికీ ప్రభుత్వ అధికారుల్లో చలనం లేదు. త్వరలోనే విద్యార్థి సంఘాలతో కలసి ఐక్య ఉద్యమ కార్యచరణ రూపొందిస్తాం. కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.

– భగీరథ్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి, కడ్తాల్‌

ఇబ్బంది పడుతున్నారు



నూతనంగా ఏర్పడిన కడ్తాల్‌ మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్మీడియట్‌ కళాశాల లేకపోవడంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత చదువులు చదువుకోలేక పదోతరగతికి చదువుకు స్వస్తి చెబుతున్నారు. పేద విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే జూనియర్‌ కళాశాల ఏర్పాటు చేయాలి.

– పిప్పల వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు, కడ్తాల్‌

చర్యలు తీసుకోవాలి



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఏర్పాటునకు చేయాల్సిన అవశ్యకత ఎంతో ఉంది. కడ్తాల్‌లో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఏర్పాటు చేస్తే మండల పరిధిలోని 24 గ్రామాలకు చెందిన పేద విద్యార్థులతో పాటు ప్రత్యేకించి గిరిజన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. కళాశాల ఏర్పాటుపై గత ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లాం. నిరుపేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని కళాశాల ఏర్పాటుపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఏర్పాటు చేయాలి.

– జర్పుల దశరథ్‌నాయక్, జెడ్పీటీసీ, కడ్తాల్‌

చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌



వినతిపత్రం ఇస్తున్న శివకుమార్‌

ఇబ్రహీంపట్నం: విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ ముందస్తూ అడ్మిషన్లు ప్రారంభించిన ప్రైవేట్, కార్పొరేట్‌ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు పి. శివకుమార్‌ డిమాండ్‌ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని విద్యాశాఖ అధికారులకు నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ నిబంధనలను పట్టించుకోకుండా ఇంటర్నేషనల్, టెక్నో ఒలంపియాడ్‌ వంటి పేర్లను ఉపయోగించుకుంటూ విద్యార్థులను, పేరెంట్స్‌ను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అంతేగాక పెద్ద హోర్డింగ్‌లు, రకరకాల ప్రచారాలు చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్‌ స్కూల్స్‌ పెద్దయెత్తున ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీకాంత్, ప్రవీణ్, శివ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి

- సమస్యలు పరిష్కరిస్తాం
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, తదితరులు

తలకొండపల్లి: అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలో పేరుకుపోయిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ తిర్మణీ నిర్మలా శ్రీశైలంగౌడ్‌ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, పీఏసీఎస్‌ చైర్మన్‌ గట్ల కేశవరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వ్యవసాయ శాఖాధికారి రాజు ఎజెండా చదివారు. 3 ఎకరాల్లోపు వారికే రైతుబంధు డబ్బులు అక్కౌంట్‌లో పడ్డాయని, మిగతావారికి పడలేదని ఎంపీటీసీ రఘునాయక్‌ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడారు. ఎకరాకు రూ.15వేలు ఇస్తామన్నా రైతుబంధు డబ్బులు మంజూరు చేయాలన్నారు. రూ. 2 లక్షల రైతురుణమాఫీ త్వరగా అమలు చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చెల్లించాలన్నారు. స్పింక్లర్‌ వ్యవస్థను అభివృద్ధి పర్చుతూ, లిమిట్‌ లేకుండా స్పింక్లర్లు మంజూర్‌ చేయాలన్నారు. పాల ఉత్పత్తిదారులకు లీటర్‌కు రూ.4 ప్రోత్సాహక డబ్బులను విడుదల చేయలన్నారు. మండల వ్యాప్తంగా రూ.5 కోట్లు ఇన్సెంటీవ్‌ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుబంధు డబ్బులు అందరికీ పడ్డాయని, సాంకేతిక కారాణాల వల్ల రైతుబంధు డబ్బులు పడటంలో జాప్యం జరిగిందన్నారు. పీఏసీఎస్‌ గోదాం ఆవరణ ముందు లారీలు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పీఏసీఎస్‌ చైర్మన్‌ గట్ల కేశవరెడ్డి సభలో పేర్కొన్నారు. రోడ్డు సమస్యను పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటానని తహసీల్దార్‌ రంగారెడ్డి చెప్పారు. మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణం డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంతో సంఘాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ రమేశ్‌ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా వైద్య సిబ్బందిని నియమించాలని, ప్రభుత్వ పాఠశాలలో అవసరమగు ఉపాధ్యాయులను నియమించాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. స్థానిక హాస్పిటల్‌ మరమ్మత్తులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని సభ్యులు సభలో పేర్కొన్నారు. పలు గ్రామాల్లో ఇండ్లపై వ్రేలాడుతున్న విద్యుత్‌ వైర్లను సరి చేయాలని ఎంపీటీసీ అంబాజీ తెలాపారు. ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఆన్‌ఆఫ్‌ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. వెల్జాల్, అంతారం, చుక్కాపూర్, వెంకటాపూర్, జూలపల్లి, రాంపూర్, మెదక్‌పల్లి గ్రామాల్లో ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేయాలని ఎంపీటీసీలు రమేష్, అంబాజీలు పేర్కొన్నారు. జెడ్పీటీసీ వెంకటేష్, పీఏసీఎస్‌ చైర్మన్‌ కేశవరెడ్డి, ఎంపీపీ నిర్మల, వైస్‌ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, తహసీల్దార్‌ రంగారెడ్డి, ఎంపీడీఓ శ్రీకాంత్, ఏఓ రాజు, ఎంఈఓ సర్దార్‌నాయక్, ఏపీఓ కృష్ణ, సీడీపీఓ రోజా, డాక్టర్లు కల్పన, సైదమ్మ, ఎంపీటీసీ సరిత, పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి



ఆమనగల్లులో వాసవీమాత దోలారోహణంలో పాల్గొన్న మహిళలు



అబ్దుల్లాపూర్‌మెట్‌: సామూహిక కుంకుమార్చనలో ఆర్యవైశ్య మహిళలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలను దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాసవీ మాత జయంతి సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ఉదయం అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీమాత డోలారోహణంలో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహా, కోశాధికారి డా.శ్రీనివాస్, సభ్యులు బికుమాండ్ల పాండయ్య, కండె పాండురంగయ్య, పాపిశెట్టి రాము, ఆకుతోట శ్రీనివాస్, లక్ష్మయ్య, సురేశ్, కృష్ణయ్య, గోపాల్, కిశోర్, కొ్ట్ర మల్లేశ్‌ పాల్గొన్నారు.

యాచారం: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వీరబొమ్మల శ్రీనువాస్‌గుప్తా, నాయకులు రవీందర్‌గుప్తా, మురళీకృష్ణగుప్తా, సురేందర్‌గుప్తా, నర్సింహగుప్తా, సంతోష్‌గుప్తా, లక్ష్మణ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌: వాసవి జయంతిని పురస్కరించుకుని పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లో వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన, నక్షత్ర హారతి చేశారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్‌ సంగీత మోహన్‌ గుప్తా, వాసవి సేవా సమితి అధ్యక్షుడు సాదు శ్రీనివాస్‌ గుప్తా, కోశాధికారి సతీష్‌ గుప్తా, జనరల్‌ సెక్రటరీ పేరం కృష్ణ, కిషోర్, అంజయ్య, అజయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచాల: వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగామంచాల మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం కుంకుమార్చన నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం పొలిటికల్‌ చైర్మన్‌ వనపర్తి భద్రినాథ్‌ గుప్తా ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో లాల్‌బహదూర్‌ శాస్త్రీ, చంద్రమౌళి, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో

అబ్దుల్లాపూర్‌మెట్‌: వైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవీ మాత జయంతిని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం బాటసింగారం గ్రామంలోని వాసవీ సాయి శ్రీనివాస దేవస్థానం సముదాయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

గీత కార్మికుడి కుటుంబానికి సాయం

అబ్దుల్లాపూర్‌మెట్‌: ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కింద పడి మృతిచెందిన అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం మజీద్‌పూర్‌ గ్రామానికి చెందిన గీత కార్మికుడు గండేటి తేజ కుటుంబానికి కౌండిన్య అసోసియేషన్‌ ఆఫ్‌ నార్త్‌ అమెరికా ట్రస్టు సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. మృతుడి వివరాలను మోడెపు యాదగిరి గౌడ్‌ ద్వారా తెలుసుకున్న కౌండిన్య అసోసియేషన్‌ ఆఫ్‌ నార్త్‌ అమెరికా ట్రస్టు సభ్యులు మృతుడి కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయం వాలంటీర్ల సహాయంతో అందించారు. వాలంటీర్లు నాతి పాండు, నాతి రాఘవేంద్ర, నాతి గణేష్, మోడెపు యాదగిరి గౌడ్, అజయ్‌ కుమార్‌ గౌడ్, గీత కార్మికుల సంఘం గ్రామ అధ్యక్షుడు మేడిపల్లి అంజయ్య, గౌడసంఘం పెద్దలు పండాల నర్సిహ్మా, గోపగోని దర్శన్, బొడిగె మల్లేష్, మేడిపల్లి రాములు, మేడిపల్లి వెంకటేష్, పందుల జగన్, గడ్డం వెంకటేష్, కసరగోని వెంకటేష్, బొమ్మకంటి నగేష్, చెరుకూరి శివశంకర్, గుత్తి నర్సింహ, మెరుగు పరమేష్‌లు పాల్గొని కౌండిన్య అసోసియేషన్‌ ఆఫ్‌ నార్త్‌ అమెరికా ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామకంఠం భూమిని కాపాడండి

కలెక్టర్‌కు ఎంపీ పటేల్‌గూడ ప్రజల ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం రూరల్‌: మున్సిపాలిటీ పరిధి, ఎంపీ పటేల్‌గూడలోని జంగం కుంట సమీపంలో సర్వే నంబర్‌ 111లో ఉన్న10 గుంటల ప్రభుత్వ భూమిని వెంకటేశ్వరరెడ్డి అనే వ్యాపారి కబ్జా చేసి ప్రహరీ నిర్మించాడని శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్, ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌లకు ఎంపీ పటేల్‌గూడ ప్రజలు ఫిర్యాదు చేశారు. అధికారులు ఎన్నికల్లో నిమగ్నమై ఉండగా కబ్జాకు పాల్పడినట్లు తెలిపారు. కబ్జా చేసిన భూమిని కాపాడాలని, ప్రహరీ తొలగించాలని కోరారు. నేడు ఎమ్మెల్యేను కలిసి విన్నవిస్తామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారు పాశం భిక్షపతిగౌడ్, యాదగిరి, ఏపీ చారి, దేవాదాసు, నర్సింహాలతో పాటు తదితరులు ఉన్నారు.

చిరు జల్లుతో వర్షం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో శనివారం సాయంత్రం చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం చల్లగా మారింది. సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. వివిధ పనులపై బయటకు వెళ్ళేవారు ఇబ్బందులు పడ్డారు.

ఇబ్రహీంపట్నం రూరల్‌: ఆదిబట్ల మున్సిపాలిటీలో కుండపోత వర్షం కురిసింది. కొంగరకలాన్, బొంగ్లూర్, ఆదిబట్ల ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో వర్షపు నీరు రోడ్లపై వచ్చి చేరింది. టీసీఎస్‌ ముందు రోడ్లపై వాహనాలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కొంగరకలాన్‌లోని దాతర్‌చెరువులోకి భారీగా నీరు చేరుతుంది. కొంగరకలాన్‌ నుంచి ఎల్మినేడు వెళ్లే రహదారిలో వరదలతో రాకపోకలకు కొద్ది సేపు ఇబ్బందికరంగా మారింది.



ఇబ్రహీంపట్నంలో చిరుజల్లులతో కూడిన వర్షం



దాతర్‌చెరువులోకి చేరుతున్న వరద

రైతులకు అన్యాయం చేస్తే సహించం



రైతులతో మాట్లాడుతున్న భాషయ్య తదితరులు

మంచాల: ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతాంగానికి అన్యాయం చేస్తే సహించమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య పేర్కొన్నారు. శనివారం మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య గౌడ్‌తో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ఎండా, వానా లెక్క చేయకుండా కష్టపడి పంట పండిస్తే కొనుగోలు చేయడంలో ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వాలే ఒక గింజ వదలకుండా కొనుగోలు చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొస్తే తేమ అధికంగా ఉందని, సిబ్బంది లేరని, రైస్‌ మిల్లర్లు తీసుకోవడం లేదంటూ ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదన్నారు. ప్రభుత్వమే అధిక ధరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించడంతో రైతులు గ్రామాల నుంచి కిరాయి ట్రాక్టర్ల ద్వారా వరి ధాన్యం తీసుకొస్తే సకాలంలో కొనుగోలు చేయకుండా రోజుల తరబడి ఇబ్బందులకు గురి చేయడం సరైందికాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన్నట్లుగా గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతులను ఏమాత్రం ఇబ్బందులకు గురి చేయొద్దని హెచ్చరించారు. ఎక్కడ సమస్య ఉన్నా బీజేపీ ఆధ్వర్యంలో అండగా నిలబడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు నూకం రాజు, గడ్డం రాజేందర్‌రెడ్డి, కిసాన్‌ మోర్చ ప్రధాన కార్యదర్శి నర్ల కృష్ణ, వెంకట్‌రెడ్డి, కొంగర సత్తిరెడ్డి, మంద మోహన్‌రెడ్డి, శ్రీశైలం, పూర్ణచంద్‌ పాల్గొన్నారు.

మంచాల: వరి ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్‌ నాయకులు పేర్కొన్నారు. శనివారం మంచాల మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వచ్చిన ధాన్యం వచ్చినట్లుగా కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ డైరెక్టర్లు హన్మంత్‌రెడ్డి, జెనిగె వెంకటేష్, మంచాల ఎంపీటీసీ సభ్యుడు ఎద్మా నరేందర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్‌ సభ్యుడు వాజీద్, నాయకులు సురేష్, రమేష్, జంగయ్యగౌడ్, శ్రీనివాస్‌నాయక్, హరికిషన్‌రెడ్డి, బాలరాజ్, లింగం గౌడ్, సంపత్‌రెడ్డి, లచ్చు నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.